క్లుప్తంగా

దొంగతనంపై కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో కొద్ది నెలలుగా గొర్రెలు, మేకలతో పాటు విద్యుత్ మోటార్లు అపహరణకు గురవుతున్నాయి. దీనికి సంబంధించి ఆదివారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు.

రైతుల అభివృద్ధికి కృషి



గొట్లాం పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్

బొండపల్లి: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిగడం శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు సభ్యులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుదర్శన్

వేపాడ: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో వల్లంపూడి ఎస్సై సుదర్శన్‌తో పాటు సిబ్బంది కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. చిన దుంగాడ, పెద దుంగాడ, కడకొండ, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో తనిఖీలు చేపట్టి.. ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో అందివ్వాలన్నారు. అలాగే సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో ఏఎస్సై నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అలమండలో మెగా వైద్యశిబిరం



అలమండలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జామి: మండలంలోని అలమండ ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. రక్త పరీక్షలు, ఈసీజీ, తదితర పరీక్షలు చేపట్టారు. అలాగే గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించేందుకు కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో వీయూఎంసీ వైద్యులు, బెహరా ఆస్పత్రి సిబ్బంది, టైయో ల్యాబ్ సభ్యులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



రోడ్డుపై పారుతున్న తాగునీరు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని ప్రధాన రహదారిలో సినిమా హాల్ జంక్షన్ వద్ద తాగునీటి కుళాయి పైపులైనుకు ఏర్పడిన లీకులు వల్ల తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మన గ్రోమోర్ షాపును తనిఖీ చేసి, ఆ షాపులోని నిల్వ ఎరువులు, రికార్డులు పరిశీలించి సరిచూశారు. అక్కడి నుంచి పేరాపురం వేంకటేశ్వర ట్రేడర్స్‌కు వెళ్లి, అక్కడి ఎరువులు, పురుగుమందుల అమ్మకాల రికార్డులు చూసి, స్టాక్‌కు సరిపడ నిల్వలు ఉన్నాయా లేదా అనేది చూశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ, విజిలెన్స్ అధికారి ఎ.కామేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ఎరువుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి టి.సంగీత హెచ్చరించారు. మండలంలోని సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్ ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపును వారు ఆదివారం తనిఖీ చేశారు. షాపులోని ఎరువుల నిల్వలను, స్టాకు రిజిస్టర్‌లతో పోల్చి సరి చూశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దక్కని గౌరవం.. వేతనం ..

- ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవ వేతనం
- అత్యధిక శాతం మంది వైఎస్సార్‌సీపీ వారే
- ప్రభుత్వ కార్యక్రమాలకు అందని ఆహ్వానం



మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయం

మెరకముడిదాం:

వారంతా ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు. స్థానిక సంస్థల్లో, మండల అభివృద్ధికి సంబంధించిన పరిపాలనా పరమైన అంశాల్లో వారి ఆమోదం తప్పనిసరి. అయితే కూటమి అధికారం చేపట్టిన తర్వాత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రభుత్వం డమ్మీలుగా మార్చేసింది. ఎంపీటీసీ సభ్యుల్లో ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ వారు కావడంతోనే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని పలువురు ఎంపీటీసీలు అంటున్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు అయిదు నెలలుగా కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలు విడుదల చేయలేదు. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాలకు కూడా వీరికి ఆహ్వానం అందడం లేదు. ఎంపీటీసీ సభ్యులను పక్కన పెట్టి ఏ అర్హత లేని కూటమి నాయకులు అధికారిక కార్యక్రమాలను అంతా తామై నడిపిస్తున్నారు. అధికారులు సైతం వారికి జీహుజూర్ అంటు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారు. తమకు ఆహ్వానం లేకుండా కూటమి నాయకులతో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహి స్తుండడంపై ఎంపీటీసీ సభ్యులు మండిపడుతున్నారు. ఎంపీటీసీ సభ్యులుగా తమకి గౌరవవేతనం దక్కడం లేదు సరికదా కనీస గౌరవం కూడా దక్కడం లేదని పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు.

ఒక్కొక్కరికీ రూ.15 వేలు బకాయి

మండలంలో కో- ఆప్షన్ సభ్యుడితో కలిసి మొత్తం 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. అయిదునెలలుగా వేతనాలు అందకపోవడంతో ఒక్కొక్కరికీ ప్రభుత్వం రూ.15 వేలు బకాయి పడింది. ఎంపీటీసీ సభ్యుల్లో ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ వారు కావడంతోనే ప్రభుత్వం ఇలా తమను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా, వేతనాలు చెల్లించకుండా అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదని ఎంపీటీసీ సభ్యులు అంటున్నారు.

నిధులు విడుదలైన వెంటనే జమజేస్తాం



ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు వారి ఖాతాల్లో జమ చేస్తాం. ఇటీవలే కొన్ని నెలల వేతనాలు అందజేశాం.పెండింగ్ ఉన్న 5 నెలల వేతనాలను నిధులు విడదల కాగానే అందజేస్తాం.

– గొర్లె భాస్కరరావు, ఎంపీడీఓ, మెరకముడిదాం

విజ్ఞానం పెంపొందించేందుకే క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీడీ అన్నపూర్ణ

గజపతినగరం రూరల్: విజ్ఞానం పెంపొందించేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అన్నపూర్ణ అన్నారు. మండలంలోని లోగిశ సమీకృత బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 14 ప్రీ మెట్రిక్, 16 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నెలకోసారి క్విజ్‌పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి ఎస్. అప్పలనాయుడు, కె.రామాంజనేయులు, ఎం.రాంబాబు, జి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడకు బస్సు సౌకర్యం కల్పించండి



ఆర్టీసీ రీజనల్ చైర్మన్ దొన్నుదొరకు వినతిపత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త అప్పారావు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడకు బస్సు సదుపాయం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కోరారు. ఈమేరకు ఆర్టీసీ ఉత్తరాంధ్ర రీజనల్ చైర్మన్ దొన్నుదొరను అరకులోని అతని నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ నుంచి కొత్తవలస, సోంపురం మీదుగా వేపాడకు నైట్‌హాల్ట్ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ఎస్.కోట నుంచి చోడవరం, ఎం.అలమండ, అనకాపల్లి, విజయనగరానికి బస్సు వేయాలని కోరినట్లు చెప్పారు. దీనిపై రీజనల్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని అప్పారావు తెలిపారు.

• సంకెళ్లతో నిరసన..



జిందాల్ నిర్వాసితులు ఆదివారం బొడ్డవరలో తమ చేతులకు నల్ల సంకెళ్లు వేసుకుని నిరసన కొనసాగించారు. నల్ల చట్టాలు, నల్ల ప్రభుత్వం నడుస్తోందని రైతు సంఘం నేత చల్లా జగన్ ఈ సందర్భంగా విమర్శించారు. జిందాల్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

- శృంగవరపుకోట

మట్టి వినాయకులను పూజిద్దాం..



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జియో వ్యవస్థాపకుడు రామకృష్ణ, సర్పంచ్ కనకరాజు

వేపాడ: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి, కాలుష్యాన్ని నివారిద్దామని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని ముకుందపురంలో సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు నేతృత్వంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉందన్నారు. అనంతరం మట్టి వినాయకులను పూజిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జి.వెంకటరావు, గోపిశెట్టి నాగేశ్వరరావు, డి.రవి, ఏ.ప్రభాష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించండి..

శృంగవరపుకోట: పర్యావరణానికి ఇబ్బంది లేనివిధంగా మట్టి గణపతులను పూజించాలని జియో, హార్ట్స్ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు సూచించారు. ఈ మేరకు ఆదివారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. 'జియో' రామకృష్ణ మాట్లాడుతూ.. రసాయనాలు, రంగులు ఉన్న వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కాలుష్యమై, జలచరాలు మృతి చెందుతాయన్నారు. కార్యక్రమంలో చల్లా త్రినాథ్, శ్రీనివాసరావు, ఎ.ప్రభాస్ పాల్గొన్నారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న 'జియో', 'హార్ట్స్' సంస్థల ప్రతినిధులు

పంపిణీకి సిద్ధంగా మొక్కలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వి.పి.రేగలో ఉన్న ప్రభుత్వ నర్సరీలో ఉచితంగా పంపిణీ చేసేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని నర్సరీ నిర్వాహకుడు అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. నర్సరీలో చైనాబాదం, తాని, దేవకాంచన, టేకు, గుమ్మటేకు, జీడి, ఉసిరి, నేరేడు,మారాడు ,జామ,పనస తదితర జాతుల మొక్కలు ఉన్నాయని చెప్పారు.

మొక్కలు కావాల్సిన వారు ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు..

- పోరాటాలు చేస్తే గాని పథకాలు అమలు చేయడం లేదు
- వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి సైనికుల్లా పనిచేయాలి
- విశాఖపట్నం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కదిరి బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కదిరి బాబూరావు

కొత్తవలస: కూటమి వైఫల్యాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని విశాఖపట్నం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కదిరి బాబూరావు అన్నారు. పోరాటాలు చేస్తే తప్ప ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. మండలంలోని అర్దన్నపాలెం గ్రామ సమీపంలో గల మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. కూటమి పాలన అస్తవ్యస్తంగా ఉందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలన్నారు. ప్రస్తుతం పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను మరింత పటిష్టంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనకు మద్దతు పలికేందుకు ఎల్లో మీడియా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నేరుగా కలిసి వారి సమాచారం తెలుసుకుని అండగా నిలవాలని సూచించారు. వారు ఇబ్బందుల్లో ఉన్నట్లయితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శోభా హైమావతి మాట్లాడుతూ.. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలనే అనుకరిస్తోందని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకాన్నీ శతశాతం అమలు చేయలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు ఏనాడూ ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బంది పడలేదన్నారు. అయితే కూటమి పాలనలో మాత్రం అన్నదాత రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, సబ్బవరపు అరుణ, జామి, వేపాడ జెడ్పీటీసీ సభ్యులు గొర్లె సరాయి, ఎస్.అప్పారావు, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాల పార్టీ అధ్యక్షులు, కొత్తవలస మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, పార్టీ నాయకుడు బొంతల వెంకటరావు, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నాయకులు

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు గొరపల్లి రవికుమార్

కొత్తవలస: మండల కేంద్రంలో గల కొత్తవలస రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు గతంలో హాల్టులు ఉండి.. కరోనా సమయంలో రద్దు చేశారని.. వాటిని పునరుద్ధరించాలని కోరుతూ జనసేన నాయకుడు గొరపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. కొత్తవలస రైల్వే స్టేషన్ మీదగా నిత్యం వెళ్లే పలు రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. రాయఘాడ, కోర్బా, భువనేశ్వర్ ఇంటర్ సిటీ, సమత, ప్రశాంతి, తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

భగవద్గీత జీవన విధానం



భగవద్గీత ప్రవచనం చెబుతున్న పండితుడు భాస్కరశర్మ

శృంగవరపుకోట: భగవద్గీత భారతీయ జీవన విధానయని సంస్కృత పండితుడు విన్నకోట భాస్కరశర్మ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక మోక్ష విద్య యోగమందిర్‌లో వ్యవస్థాపకుడు శీలా కోటీశ్వరరావు నేతృత్వంలో భగవద్గీత ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరశర్మ మాట్లాడుతూ.. భగవద్గీత విశిష్టతను మాటల్లో వర్ణించడం ఎవ్వరికీ సాధ్యం కాదన్నారు. సంస్కృత శ్లోకాలను పఠించి, వాటి అర్థాన్ని తెలుగులో వివరించారు. అనంతరం స్వామి వివేకానంద, భగవద్గీత పుస్తకాలతో కూడిన స్టాల్ ఏర్పాటు చేసి ప్రతులను పంపిణీ చేశారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

దత్తిరాజేరు: పాత రేషన్‌కార్డుల స్థానంలోట ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు తీసుకువచ్చినట్లు తహసీల్దార్ విజయ్‌భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటీఎం మాదిరిగా ఉన్న ఈ కార్డులను సోమవారం నుంచి రేషన్ దుకాణాల వద్ద పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే డీలర్లకు 16,622 కార్డులు అందజేసినట్లు చెప్పారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా విగ్రహాలు పెట్టొద్దు



మాట్లాడుతున్న జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు సత్యలత

విజయనగరం: భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా దేవాది దేవుడైన శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాలు ఏర్పాటు చేయడం తగదని జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత అన్నారు. ఇదే విషయమై ఆమె దాసన్నపేటలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు జిల్లా, తక్కెళ్లపాడు గ్రామంలోని స్థానికులు శ్రీకృష్ణుని విగ్రహాన్ని స్వర్గీయ ఎన్టీఆర్ రూపంలో పెట్టడాన్ని యాదవ సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భగవంతుడు అందరి రూపాల్లోనూ ఉంటారని, అటువంటి భగవంతుడిని సినీ పరిశ్రమ రకరకాల హీరోలతో ప్రేక్షకులకు చూపించడం జరుగుతోందన్నారు. వారు చూపించేది ప్రేక్షకులను రక్తి కట్టించడానికే పరిమితం కావాలి తప్ప పూర్తిగా సమాచారం తప్పుడుగా ఉండేలా చేయవద్దన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ మంచి నటులు, గొప్ప రాజకీయ వేత్త కానీ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఆయన రూపంలో పెట్టడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. భగవంతుడిని భక్తితో మాత్రమే ఆరాధించాలని, రాజకీయ లబ్ధి కోసం ఎన్టీఆర్ రూపాన్ని, శ్రీకృష్ణుని రూపానికి ముడిపెట్టడాన్ని భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. అలాగే రాజమండ్రిలో గోదావరి నది ఒడ్డున ఎన్టీఆర్ రూపంలోని శ్రీకృష్ణుని విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ గువ్వల తిరుపతిరావు, నాయకులు బొద్దన అప్పారావు పాల్గొన్నారు.

శిక్షణకు ఎన్‌సీసీ క్యాడెట్లు



శిక్షణకు వెళుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ విశ్వకర్మలో పది రోజుల పాటు శిక్షణ పొందేందుకు ఆదివారం బయలు దేరి వెళ్లారు. ఎన్‌సీసీ అధికారి మామిడి శ్రీనివాసరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దగ్గరుండి వీరికి వీడ్కోలు పలికారు. ఐఎన్ఎస్ విశ్వకర్మలో సీఏటీసీ ఐవీ క్యాంప్‌ను పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ క్యాంప్‌లో ఎన్‌సీసీ కేడెట్లకు యూనిటీ, క్రమశిక్షణ, దేశభక్తి, స్పీడ్ థింకింగ్, దేహదారుఢ్యం, సేవాభావం, ప్రకృతి విపత్తుల సమయంలో స్పందించడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈశిక్షణకు మొత్తం 47 మంది కేడెట్లు వెళ్లారని ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.